


ధ్యానంలో ఉన్నా విజయ సారథి గారి మనసు మాత్రం ప్రశాంతంగా లేదు ! రోజు రోజుకీ కొడుక్కీ, కోడలికి మధ్య ఘర్షణ పెరుగుతోంది. అగ్ని కీలలు పెద్దవవుతూ చివరికవి ఇంటిని ఆహుతి చేసేలా ఉన్నాయి

కొడుకుని ఎంతో క్రమశిక్షణతో పెంచాడు. పెద్ద చదువులు చెప్పించాడు. కొడుకు సంజయ్ వర్మ అయ్యేయెస్‌లో సెలెక్ట్ అయి కలెక్టర్ అయ్యాడు. బాగా చదువుకున్న అమ్మాయి వినీతని కోడలిగా చేసుకున్నాడు.

అయితే అప్పట్నించి ఆ ఇంట్లో కలకలం ప్రారంభమయింది. కొడుకు ఆదర్శాలు వేరు ! కోడలి ప్రాపంచిక దృక్పథం వేరు ! ఇద్దరూ విభేదించుకుంటున్న కాలంలోనే పాప నిర్మల పుట్టింది.

నిర్మల రాకతో సమస్యలు తగ్గుతాయనుకుంటే మరింత పెరిగాయి. దానికి తోడు ఈ పెద రామయ్య ఫ్యాక్టరీ తాలూకు వ్యవహారం ఒకటి వచ్చిపడింది. ఆయన ఫ్యాక్టరీ లోంచి వెలువడే పొగ మూలాన ఆ చుట్టుప్రక్కల ప్రజలకు లంగ్ క్యాన్సర్ వస్తోంది. ఆ విషయం శోధించి కనుక్కొని సంజయ్ ఆ ఫ్యాక్టరీని మూయించాడు.

అయితే ఏదో ఒక రకంగా దాన్ని తెరిపించాలని పెదరామయ్య వ్యూహం ! అందులో భాగంగానే కోడలి బలహీనతల్ని కనిపెట్టాడు. ఆమె ద్వారా పని జరిగేలా పావులు కదిపాడు. దాని పర్యవసానమే ఇంట్లో భయంకరమైన యుద్ధం !

జరిగిన సంఘటనలు సారథిగారి స్మృతిపథంలో మెదిలాయి.

ఆ రోజు పెదరామయ్య ఏకంగా ఇంటికి వచ్చాడు. కోడలు అతన్ని ఆహ్వానించింది. మర్యాదలు చేసింది. అనక బెడ్రూంలోకెళ్ళి భర్తతో -

"పెదరామయ్య గారు మీ కోసం వచ్చారు ! హాల్లో సోఫాలో కూర్చోబెట్టాను !" చెప్పింది. సంజయ్ ఆమెని సీరియస్‌గా చూసి "రేపు ఆఫీసుకి రమ్మని చెప్పు !" అనేసి మళ్ళీ మొహం ఫైళ్ళలో దూర్చబోయాడు.

వినీత ఒక్క ఉదుటున భర్త దగ్గరికి వెళ్ళి "అతను మిమ్మల్ని కలవాలనుకుంటున్నది అఫీషియల్‌గా కాదు... పర్సనల్‌గా !" గట్టిగా అంది.

"అతనికీ నాకు ఎలాంటి పర్సనల్ రిలేషన్ లేదు !" సౌమ్యంగా చెప్పాడు.

"అవును —లేదు ! అయితే ఆ రిలేషన్ ఏర్పడాలనే ఆయనిలా మనింటికొచ్చింది !"

"నా కది ఇష్టంలేదని ఇప్పటికే ఆయనకే కాక నీకూ లక్షసార్లు చెప్పాను!"

"చెప్పిన లక్షసార్లూ నేనూ మీకు మీరు మారాలని, మీ దృక్పథంలో మార్పు రావాలని చెప్పాను !"

"నువ్వు మారమని చెప్పావు ! కానీ నేను ఎలా మారాలి ? ఏ రకంగా మారాలి ? నీ దృష్టిలో నే నొక లంచగొండిగా మారాలి ? అవునా ?"

"మీరు వంకర పేర్లు తగిలిస్తే ఎలా ? కొద్దిగా మన భవిష్యత్తు గురించి, పాప గురించి ఆలోచించమని చెప్తున్నాను ! అయినా లంచగొండి అన్నదేమీ తప్పు పేరు కాదులెండి ! ఆ మాత్రం కాస్త మారండి !"

"కానీ నా దృష్టిలో అది నేనో పశువుగా మారడమన్నమాటే ! నిన్ను నేను బుద్ధి, జ్ఞానంలేని ఓ గొర్రె లాగా మారు వినీత అంటే నువ్వు మారిపోతావా ?"

"అర్థంపర్థంలేని లాజిక్కులు లాగకండి !"

"ఇవి లాజిక్కులు కావు వినీ ! మనిషి సంస్కారానికి సంబంధించిన విషయాలు ! అజ్ఞానం కొద్దీ కొందరు చెడు ఆలోచనలతో ఉండొచ్చు. కానీ వాళ్ళే చివరికి మంచి వారుగా మారిపోనూ వొచ్చు ! అంతేకానీ ఎవ్వరూ మంచి నుంచి చెడుకి మాత్రం ప్రయాణించరు !"

సంజయ్ ఎంతో ప్రశాంతంగా చెబుతుంటే ఒక్కసారిగా ఆమెలో దుఃఖం పొంగుకొచ్చి "ఎన్ని చెప్పినా మీ వ్యర్థ ప్రసంగాలు మానరు కదా !" అంటూ గట్టిగా రోదించింది. ఆ బీభత్సానికి హాల్లో కూర్చున్న పెదరామయ్య కంగారుగా లేచి వెళ్ళిపోయాడు.

అయితే ఇంట్లో తుఫాను వాతావరణం తగ్గి ప్రశాంతత నెలకొనేందుకు చాలా కాలమే పట్టింది.

మరొక రోజు వినీత పెద్దగా అరుస్తూ "మీతో పని చేసే వాళ్ళ భార్యల్ని చూడండి ! ఒంటినిండా నగలతో బీరువా నిండా పట్టు చీరలతో ఎలా కళకళగా ఉన్నారో !

నా కర్మకాలి... నే నొక్కదాన్నే ఇలా కళావిహీనంగా ఉన్నాను !" నిస్పృహగా అన్నది. అప్పుడు సంజయ్ ఆమెని దగ్గరికి తీసుకుని-

"చూడు వినీ ! ధనవంతుడు తన కారు సైతం ఆకర్షణీయంగా ఉండాలని దానికి అలంకరణ చేస్తాడు. చదువుకునే కుర్రాడు అందం పెరగాలని మంచి డ్రెస్ చేసుకుంటాడు. టీనేజ్ అమ్మాయి లిప్‌స్టిక్ పూసుకుని ఆకట్టుకోవాలనుకుంటుంది. అయితే నువ్వు

గమనించావో లేదో కానీ ఎంతో అందమైన పువ్వు ఏ అలంకరణా చేసుకోదు. రంగు రంగుల పక్షి అందరి దృష్టిని ఆకర్షించాలని మరిన్ని రంగులు పులుముకోదు ! వాటి శారీరక ఆకర్షణ సైతం నేచురల్‌గా ఉన్నదే ! అవి నటించవు ! మనం కూడా అలా తయారవ్వాలి ! నువ్వు నీ ప్రవర్తన ద్వారా నీ సంస్కారం ద్వారా అందరికీ గుర్తుండిపోవాలి !" అని చెప్పగానే ఆమె కోపంగా అతన్నుండి దూరంగా జరిగి-

"అవునవును ! అందరికీ అలానే గుర్తున్నాను ! అన్నీ ఉన్నా ఏమీలేనిదానిలా-దరిద్రం ఓడుతూ ఓ సామాన్యురాలిలాగా ! ఛీ ! ఛీ ! నన్ను చూసి నా వెనుక ఎలా నవ్వుకుంటున్నారో అందరూ !" మొహం చిట్లిస్తూ అంది.

"వినీ ! సామాన్యమైన నీ శారీరక అందం చూసి నీ వెనుక నవ్వుకుంటున్నారని రంగులు పూసుకుంటావా ? అసలు సామాన్యంగా ఉండడం అంటే అర్థం తెలుసా ? డబ్బు కోసమో, ప్రతిష్ఠకోసమో, మనసులో రగిలే కోరికల్ని తీర్చుకోవడం కోసమో అంటిపెట్టుకుని చివరికి జీవితాన్ని వీటితోనే ముగించడం అనే దాన్ని సామాన్యంగా బ్రతకడం అంటారు. ఈ గానుగెద్దు జీవితంలోంచి బైటికి రా !"

"వస్తాను ! అవును ! ఈ గానుగెద్దు జీవితంలోంచి బైటికొస్తాను !" అంటూ ఆమె కూతుర్ని తీసుకుని సూటుకేసుతో తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళిపోయింది.

మూడు రోజులు గడిచాక మనవరాలు నిర్మల స్కూల్ నుంచి సరాసరి సారథిగారింటికొచ్చేసింద. ఎంత చెప్పినా తల్లిదగ్గరికెళ్ళనుగాక వెళ్ళనంటూ మొండికేసింది. పిల్లల కోసమైనా తల్లి తిరిగి తన ఇంటికొస్తుందన్న ఆశతో సారథిగారు రెండు నెలలు వేచి చూసి ఆ తర్వాత ఆయనే స్వయంగా వాళ్ళ ఇంటికెళ్ళి కోడలికి నచ్చచెప్పి ఇంటికి తీసుకొచ్చేరు.

అయితే పరిస్థితిలో మార్పు లేదు !

ధ్యానం కాస్త పరధ్యానంగా మారడంతో కళ్ళు తెరచి వాస్తవంలో కొచ్చేరు సారథి గారు !.....

హాల్లో సంజయ్ తండ్రిని చూసి వంగి కాళ్ళకి దండం పెడుతూ-

"నాన్నగారూ ! ఈ రోజు నుండి కొత్త ఉద్యోగానికెళ్తున్నాను ! ఆశీర్వదించండి !" అన్నాడు.

విషయం ఏంటో సారథిగారు అడిగేలోపలే వినీత దూసుకొచ్చి !

"ఏమిటీ ! బంగారం లాంటి ప్రభుత్వ ఉద్యోగం వదిలేశారా ?" కోపంగా అడిగింది.

"అవును వినీ ! మేలిమి బంగారం లాంటి ఓ స్వచ్ఛంద సేవా సంస్థలో చేరాను ! నాన్న గారూ ! మీ ఆశలకి, ఆదర్శాలకి తగిన విధంగా ఉండే ఈ సంస్థ ద్వారా సమాజ సేవ చేద్దామని నిర్ణయం తీసుకున్నాను ! ఎటూ మనకి ఆర్థిక సమస్యలు లేవు. పైగా ప్రభుత్వ ఉద్యోగంలో వస్తున్న వొత్తిళ్ళు భరించడం భారంగా ఉంది" ఆ



మాటలు వినగానే ఒక్కసారిగా వినీత హిస్టీరిక్‌గా మారిపోయింది. పెద్దగా ఏడుస్తూ-

"అయ్యో ! ఎంతపని చేశారండీ ! పెద్ద కలెక్టర్ ఉద్యోగం, బంగళా అన్నీ వదిలేశారా ? అయినా మీ ఉద్యోగం చూసి మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నానే-నేనొకదాన్ని ఉన్నానని కూడా ఆలోచించకుండా ఎలా చేశారండీ ఇంత దారుణం !" సంజయ్‌ని పట్టుకుని రోదించింది. అతను ఆమెని ఆప్యాయంగా పొదివిపట్టుకుని-

"చూడు వినీ ! పెద్ద బంగళా కలెక్టర్ ఉద్యోగం అన్నావే-దానికతీతమైన ఎంతో ఉన్నతమైన బాధ్యతాయుతమైన పదవి దొరికింది. రా-నువ్వు నాతో వచ్చెయ్యి ! నీకున్న చదువు, విజ్ఞానం ఆ సంస్థ కోసం వెచ్చించు ! అందులోని మానసిక ఆనందం, ప్రశాంతత ఇద్దరమూ చవి చూద్దాము" లాలనగా చెప్పాడు.

అయితే ఆమె అతన్ని దూరంగా నెట్టివేసి "నా జీవితాన్ని నాశనం చేశావు ! నా కలలు, నా ఊహలు... అన్నీ చంపేశావు ! ఛీ... ! ఛీ ... ! ఇక నీతో ఏ సంబంధమూ లేదు" అంటూ సూట్‌కేసు సర్దుకోసాగింది.

సారథిగారు నిర్ఘాంతపోయారు. ఆయన భార్య తులసమ్మ! స్థాణువులా నిలబడిపోయారు ! సంజయ్ మాత్రం చెరగని చిరునవ్వుతో, వీడని ఆదర్శాలతో వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాక సూట్‌కేసుతో గడప దాటుతున్న కోడల్ని చూసి సారథిగారు ఆందోళనగా "వినీతా ? చదువుకున్నదానివి ! ఇది మంచి పని కాదు !" అన్నారు.

"అవును ! మీరు చేసేవన్నీ మంచి పనులు ! నేను చేసేవి, చెప్పేవి చెడ్డ పనులు ! హూ ! ఇన్నాళ్ళు మర్యాదకొద్దీ ఊరుకున్నాను కానీ మీ వల్లే ఈ ఇంట్లో ఇన్ని కలతలు ! మీ మూలంగానే ఇన్ని ఘర్షణలు !"

సారథిగారికి ఒక్క క్షణం గుండె లయ తప్పింది.

"అమ్మా వినీతా ! నా మూలానా ?" కుప్పకూలినట్టు సోఫాలో పడిపోయారు.

"అవును-ముమ్మాటికీ మీ మూలానే ! మీ పెంపకం వల్లే మీ కొడుకిలా అయ్యాడు. వేదాంతం కబుర్లు చెబుతూ ముసలాడిలా చాదస్తాలతో పడి ఉన్నాడు !"

ఉద్రేకంగా అనేసి నిర్మల చెయ్యి పట్టుకుని లాక్కుపోయే ప్రయత్నం చేసింది. నిర్మల గింజుకుంటూ "నేను రాను ! తాతయ్య, నానమ్మల దగ్గరే ఉంటాను !" అంది.

వినీత కోపంగా "చావవే ! నువ్వు ఇక్కడే చావు !" అంటూ వెళ్ళిపోయింది. తులసమ్మగారు నిర్మలతో "తప్పమ్మా ! అమ్మ దగ్గరికెళ్ళు నిర్మలా !" అనగానే-

"నేను మీ ఇద్దర్నీ వదిలి ఉండలేను నానమ్మా" అంటూ గట్టిగా పట్టుకుని ఏడ్చింది. సారథిగారు సోఫాలోంచి లేవలేకపోయారు. కోడలి మాటలు గుర్తొచ్చాయి ! దీన్నికి మూల కారణం తనేనా ? ఆయన శరీరం ఒక్కసారిగా జలదరించింది ! మనసా వాచా నమ్మిన సిద్ధాంతాలు, మంచితనం అతన్ని ఒక్క కుదుపు కుదిపాయి ! ఆశ్చర్యంగా--నిర్మల ఏడుస్తూ వచ్చి "లేదు తాతయ్యా ! నువ్వు కరెక్టు తాతయ్యా ! నన్ను వదిలెయ్యకు తాతయ్యా !" అంది నిర్మల.

చాలా రోజుల మథనం తర్వాత సారథిగారికి సమాధానం దొరికినట్టయింది. మనవరాల్ని గుండెలకి హత్తుకుని, ఏడుస్తున్న భార్యని దగ్గరిగా తీసుకుని 'ఒక తరాన్ని ఉన్నతంగా సృష్టించాను ! అయితే దానికి ఊతంగా మరో తరాన్నీ నిలబెట్టాలని ఇప్పుడే తెలుసుకున్నాను !

దృఢంగా మనసులో అనుకున్నారు సారథి గారు !

●